క్లుప్తంగా

మార్చి 5న శ్రీరామ పట్టాభిషేకం


యిండుపూరు గున్నేశ్వరరావు

పార్వతీపురం: శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజన్ చినజీయర్ స్వామి పర్యవేక్షణలో మార్చి 5న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమాన్ని పార్వతీపురంలో నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీరామ పాదుకాపట్టాభిషేకం కార్యక్రమం పట్టణంలోని సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో పర్యవేక్షణలో నిర్వహించనున్నామని ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశామని చెప్పారు. కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు చెబుతూ విజయవంతం చేయాలని కోరారు.

ఛత్రపతి శివాజీకి నివాళులు


పెదపెంకిలో బాపూజీ గ్రంథాలయం వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవినాయుడు ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవినాయుడు మాట్లాడుతూ శివాజీని మరాఠా యోధుడని పిలుస్తారన్నారు. ఆయనకు ఛత్రపతి అనే బిరుదు ఏవిధంగా వచ్చిందో వివరించారు. కార్యక్రమంలో జి.శ్రావణ్, సీహెచ్.అప్పలనాయుడు, దయానంద్, మధు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పాకలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

● ఎమ్మెల్యే విజయచంద్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి విజయచంద్ర

సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయసంఘాలు, టీడీపీ బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఓటర్లను కలిసి టీడీపీ మద్దతో అభ్యర్థిగా ఉన్న పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పర్యటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సిపురంలో పారిశుధ్య కార్యక్రమాలు

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపు రం గ్రామంలోని చిన్నవీధి, సచివాలయ సమీపంలోని వీధులలో పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈనెల 18న సాక్షిలో 'ప్రచారానికే పరిమితం' శీర్షికన వెలువడిన కథనానికి స్పందించి సచివాలయ కార్యదర్శి అంపోలు కూర్మారావు పర్యవేక్షణలో పలువీధుల్లో చెత్తను తొలగించి, ట్రాక్టర్ల ద్వారా మురుగు, చెత్తను తరలించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

విజయవంతమైన మెగా వైద్యశిబిరం

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశిల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలో బుధవారం పోలీసింగ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఎస్పీ ఎస్వి.మాధవరెడ్డి, ఆదేశాలమేరకు, ఏఎస్పీ అంకిత సురాన సూచనలతో డోకిశిల గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం ఇండస్ హస్పిటల్ వైద్య బృందం జనరల్ సర్జన్, ఫిజీషియన్, ఈఎన్‌టీ, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఆర్థోపెడిక్ డా.రాహుల్, డా.సౌజన్య, డా.,శ్రీకాంత్, డా.కౌశిక్‌బి. రాజ్ ప్రేం గురుబక్ష్మి తదితరులు ఈశిబిరంలో 350 మందికి పైగా గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గోవిందరావు, రూరల్ ఎస్సై జయంతి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఇతర సిబ్బంది పాల్గొని అవసరమైన సేవలను అందించారు.

పాచిపెంటలో మెగా వైద్యశిబిరం

పాచిపెంట: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాచిపెంట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. సుమారు 250 మంది ప్రజలు ఈ శిబిరానికి రాగా వారికి వైద్యులు పరీక్షలు చేసి మందులను అందించారని ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. పలువురు యువతకు వాలీబాల్ కిట్లు ఈ సందర్భంగా అందించారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

- సేవలు అందక ప్రజలు అవస్థలు
- అదనపు బాధ్యతలు అప్పగించడంతో అందుబాటులోలేని ఉద్యోగులు
- వ్యవస్థ నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం ఎత్తుగడ

బోసిపోతున్న సచివాలయాలు


ఎమ్మార్‌నగరం సచివాలయంలో సిబ్బందిలేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

పార్వతీపురం రూరల్:

గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. సచివాలయాల్లో ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పలు సచివాలయాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలకు సేవలు గగనమయ్యాయి. సచివాలయ సిబ్బందిని సచివాలయానికి కాకుండా ఇతర కార్యాలయాలకు మౌఖిక ఆదేశాలతో తాత్కాలికంగా బదిలీచేసి అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నారు. సచివాలయ సిబ్బందిని గ్రామ ప్రజలకు దూరం చేయడంతో పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించలేక అవస్థలు పడుతున్నారు. రైతులకు కూడా సక్రమంగా సేవలు అందకపోవడంతో నిత్యం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ప్రజలు-సచివాలయ సిబ్బందికి మధ్య వారధిలా పనిచేసే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలకు అందించేవారు. దీంతో మండల కార్యాలయాలతో పనే లేకుండా ఉండేది. అయితే ఇందుకు విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తూ వలంటీర్ వ్యవస్థను రద్దుచేసి సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తోంది.

● నియోజకవర్గంలో 836 మంది ఉద్యోగులు

పార్వతీపురం నియోజకవర్గంలో 76 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. పార్వతీపురం మండలంలో 20, పార్వతీపురం మున్సిపాలిటీలో 15, బలిజిపేట మండలంలో 20, సీతానగరం మండలంలో 21 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో 836 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో పరిపాలన, విద్య, సంక్షేమం, ప్లానింగ్, నీటి సరఫరా, మహిళా పోలీస్, పారిశుధ్యం, వీఆర్‌ఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం తదితర విభాగాలతో సచివాలయాల వ్యవస్థ పనిచేస్తోంది. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ఇంజినీరింగ్, ఉద్యానశాఖ, సర్వేయర్ తదితర ఉద్యోగులను మండలాలకు బదిలీచేసి ఇతర పనులకు వినియోగిస్తున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో ఏ చిన్నపనికైనా మండల కేంద్రాల చుట్టూ ప్రజలు తిరగాల్సివస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు దాదాపు సంక్షేమ పథకాలను దూరం చేసింది. కేవలం పింఛన్ల పంపిణీ మినహా మిగిలిన పథకాలను నిలుపుదల చేసింది.

మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ



భూ సమస్యలను గతంలో సచివాలయాల్లో పరిష్కరించేవారు. ప్రస్తుతం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయినా పరిష్కారం కావడం లేదు. గతంలో సచివాలయాల్లో వీఆర్‌ఓ గ్రామంలో అందు బాటులో ఉండి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీఆర్‌ఓ మండల కేంద్రంలో కూర్చుంటున్నారు. అడంగల్, పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రజలు సచివాలయాల దగ్గరకు చెప్పులు అరిగేలా తిరుగుతున్నా అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో పనులు కావడం లేదు. ఫలానా అధికారి కోసం వస్తే ఆ అధికారి సర్వేకు వెళ్లాడని ఇతర అధికారులు చెబుతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తికమకపడుతున్నాం.

– జక్కు రమణమ్మ, లక్ష్మీనారాయణపురం,పార్వతీపురం మండలం

అవస్థలు పడుతున్నాం



గతంలో ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా గ్రామ స్థాయిలోనే పనులు పూర్తయ్యేవి. ప్రస్తుతం సచివాలయంలో పనులు జరగడంలేదు. పని జరగాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామం మండల కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒక పని మీద మండల కేంద్రానికి వెళ్లాలంటే ఆ రోజు మొత్తం ఆ పని కోసమే కేటాయించాలి. పని జరగక పోతే మళ్లీ మరుసటి రోజు వెళ్లాలి. గత ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించేది. గతంలో వలంటీర్ల ద్వారా ఏ పనిఅయినా సులభంగా జరిగేది. ఇప్పుడు ఏ పని కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

– ఉరిటి అప్పలనాయుడు, ఎమ్మార్‌నగరం, పార్వతీపురం మండలం

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా వామపక్షాల ధర్నా



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

పార్వతీపురంటౌన్: కార్పొరేట్లకు మేలు..ప్రజలకు కీడు చేకూర్చే కేంద్ర బడ్జెట్‌ను ప్రజలంతా తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ జాతీయ, రాష్ట్ర వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా బుధవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద మన్యం జిల్లా వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం బీజేపీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాలు దేశ ఆర్థిక స్థితిగతులను మార్చే రీతిలో లేవని, అది కేవలం కార్పొరేట్లకు రాయితీలను అందిస్తూ ప్రోత్సహించే బడ్జెట్‌గా మాత్రమే ఉందని, ప్రజలకు మేలు చేకూర్చని ఈ బడ్జెట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం బీజేపీ షరతులకు లొంగి రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులను కాలరాయొద్దని, రానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం దృష్టి సారించాలని కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా గిరిజన యూనివర్సిటీకి, పెండింగ్ ప్రాజెక్టులు, రిజర్వాయర్లకు, నిలిచిపోయిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి, విద్య వైద్య ఉపాధి రంగాలకు అధికమొత్తాదులో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సీపీఐ(ఎంఎల్) నాయకురాలు పి.రమణి సీపీఎం నాయకులు జి.వెంకటరమణ, రెడ్డి వేణు, సీపీఐ నాయకులు టి.జీవ, సూరయ్య, అయర్ల సంఘం నాయకుడు పి.సంఘం, సీపీఎం లిబరేషన్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కె.రామస్వామి, రైతు సంఘం నాయకుడు డీవీ నాయుడు, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, డీవైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాచలం , డేవిడ్ రాజన్న, బిడ్డిక నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులపై దాడులు అరికట్టాలి

● వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

పార్వతీపురంటౌన్: మీడియా ప్రతినిధులపై దాడులు దౌర్జన్యాలను అరికట్టాలని సీపీఎం నాయకుడు రెడ్డి వేణు డిమాండ్‌చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో వామపక్ష పార్టీలు వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పత్రికా, మీడియా ప్రతినిధులపై దౌర్జన్యాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీల నాయకులు ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే మక్కువలో పత్రిక విలేకరిపై దాడులకు పాల్పడ్డారని దాడులకు పాల్పడిన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గొర్లి వెంకటరమణ వి.ఇందిర, సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, టి.జీవ, సీపీఐ ఎంఎల్ నాయకురాలు పి . రమణి, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు పి సంఘం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, గిరిజన సంఘం నాయకులు రామస్వామి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, డీవైఎఫ్ఐ నాయకుడు పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాచలం, డేవిడ్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, రైతు సంఘం నాయకులు డీవీ నాయుడు, వ్యవసాయ కార్మిక నాయకుడు జి.సూరయ్య, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్, రాజన్న, బిడ్డిక నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురంటౌన్: పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణ పరిధిలో గల మెయిన్ రోడ్, 20, 21 వార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్, అపరిశుభ్రంగా ఉన్న కాలువలను గుర్తించామన్నారు. సంబంధిత సెక్రటరీ, మేస్త్రికి త్వరిత గతిన శుభ్రం చేయించాలని ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజు, హెల్త్ సెక్రటరీ రామారావు, శానిటేషన్ సెక్రటరీ శ్రీనివాస్, మేస్త్రి కుమార్ పాల్గొన్నారు.

రైతుగూడలో సీపీఎం కార్యాలయం ప్రారంభం


రైతుగూడలో సీపీఎం కార్యాలయం ప్రారంభంలో పాల్గొన్న నాయికుడు కృష్ణమూర్తి తదితరులు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమరికి పంచాయతీ రైతుగూడ గ్రామంలో బుధవారం సీపీఎం కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకుడు ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుగూడ గ్రామం ఒడిశా, ఆంధ్ర సరిహద్దుల్లో ఉందని, ఈ గ్రామానికి సంబంధించి పలు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ గ్రామస్తులంతా వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు సీపీఎంలోకి రావడం ఎంతో అభినందనీయమన్నారు. గిరిజనుల సమస్యలపట్ల నిరంతరం పోరాటం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.రాము, మహిళా సంఘనాయకురాలు పి.వరాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సందర్శన


ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

సీతానగరం: చెత్తనుంచి సంపద తయారీపై శిక్షణ నిర్వహించడానికి అవసరమైన వనరులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రామ పంచాయతీల అధికారి టి.కొండలరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలకేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీని డీపీఓ కొండలరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎస్‌డబ్ల్యూపీసీల నుంచి చెత్తనుంచి సంపద తయారు చేసే విధానంపై నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడానికి వనరులు సమకూరుస్తున్నామన్నారు. ఇదివరలో స్థానికంగా చెత్తనుంచి సంపద తయారు చేయడంపై శిక్షణ ఇచ్చామని, భవిష్యత్‌లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడానికి సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ జె.తేరేజమ్మ, కార్యదర్శి ఈదుబిల్లి రమేష్ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే విజయచంద్రకు వినతి పత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ ఖాతాదారులు ఏజెంట్లు అసోసియేషన్ నాయకులు

పార్వతీపురం టౌన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం భారీగా డిపాజిట్లు సేకరించిందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ల సంఘం తరపున ఎమ్మెల్యేకు వివరించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం నిధులను పక్కదారి పట్టించి సొంతంగా ఆస్తులు కొనుగోలు చేయడం, బినామీల పేరిట కొన్ని ఆస్తులు రాసుకున్నట్టు ఆరోపించారు. తర్వాత బోర్డు తిప్పేసి కస్టమర్లు, ఏజెంట్లను తీవ్ర ఇబ్బందులు గురి చేశారని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

గిరిజన జాతులు, భాషల లిపి కర్త ప్రసన్నకు అభినందనలు

సాలూరు: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా నియమితులైన, గిరిజన జాతుల భాషల లిపికర్త, నారీశక్తి అవార్డ్ గ్రహీత, ఆంధ్రా యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డా.సత్తుపాటి ప్రసన్నకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ, దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసంతో ఆమె చేసిన ఎనలేని కృషి కారణంగా నేడు నన్నయ్య యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా అత్యున్నత పదవికి చేరుకున్నారన్నారు. ఆమె ఎందరికో ఆదర్శమని పేర్కొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనకు హాజరుకండి

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం పాలకొండ వస్తున్నారని ప్రతి ఒక్కరూ ఆయన పర్యటనకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన స్వగృహంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దివంగత పాలవలస రాజశేఖరం ఇటీవల స్వర్గస్థులైన కారణంగా ఆయన కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి గురువారం మధ్యాహ్నం ఒంటి గంట దాటాక హెలికాప్టర్ ద్వారా నేరుగా పాలకొండలో గల వారి నివాసానికి విచ్చేయనున్నారని, పార్వతీపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అంతా ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

6429మంది రైతులు రిజిస్ట్రేషన్ల పూర్తి


మిర్తివలసలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రావణ్‌కుమార్

బలిజిపేట: మండలంలో ఇప్పటివరకు 6,429మంది రైతులు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మిగిలిన వారు త్వరగా చేయించుకోవాలని ఏఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్‌పై మిర్తివలసలో రైతులకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ ఎవరైతే లబ్ధిపొంది ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా మిగిలిపోయారో వారు త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ఒకే ఇంటిలో ఇద్దరు, ముగ్గురికి భూములు ఉన్నట్లయితే అందరి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. గ్రామంలో భూములు ఉంటూ ఇతర ప్రాంతాల్లో ఉండేవారు వచ్చి తప్పక రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. 1బికి ఆధార్ లింక్ లేనివారు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి లింక్ చేయించుకుని వెంటనే రైతు సేవా కేంద్రం వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో ఉండే ప్రతి రైతుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గృహహింస చట్టంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న భారతి

బలిజిపేట: గృహహింస చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వన్‌స్టాప్ కేంద్రం సభ్యురాలు భారతి అన్నారు. ఈ మేరకు బలిజిపేటలో నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్ల ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలో గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహహింసకు గురైన వారికి అండగా ఉండాలని సూచించారు. ఎవరైనా గృహహింసకు గురవుతూ అంగన్వాడీ కార్యకర్తలకు తెలియపరిస్తే అటువంటి వారికి తగిన సూచనలు ఇస్తూ 181టోల్ ఫ్రీ నంబర్‌కు వారిచేత ఫోన్ చేయించాలన్నారు. వెంటనే వన్‌స్టాప్ కేంద్రం వారు స్పందించి వారికి తగిన విధంగా సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని అంశాలను వారికి వివరించారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. గృహహింస, బాల్య వివాహాలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోద నివారణ మాత్రలు కచ్చితంగా మింగించాలి

● జిల్లా మలేరియా అధికారిణి మణి


పెదపెంకిలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మణి

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో నిర్వహిస్తున్న బోదకాలు ఇంటింటి సర్వే, మాత్రలు మింగించడంపై జిల్లా మలేరియా అధికారిణి మణి పర్యవేక్షించారు. మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో కొన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వేపై పర్యవేక్షణ చేశారు. అందులో భాగంగా పెదపెంకిలో ఇంటింటికీ తిరిగి మాత్రలు మింగిందీ లేనిది బాధితులను అడిగి తెలుసుకున్నారు. సర్వేను కచ్చితంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. డీఈసీ మాత్రలు ప్రజలచేత దగ్గరుండి వేయించాలి తప్ప ఎవరి చేతికి ఇచ్చి వదిలివేయరాదన్నారు. ఎవరిచేతికి ఇచ్చి వదిలివేసినా వారు మింగకపోతే నిరుపయోగమవుతాయన్నారు. సర్వేను ఇంటింటికీ తిరిగి ఏవిధంగా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ కర్ణ, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

● ఎమ్మెల్యే విజయ్ చంద్ర


ఆలయంలో అర్చకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

బలిజిపేట: పురాతన దేవాలయమైప శ్రీవేంకటేశ్వర ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలోని శ్రీవేంకటేశ్వర ఆలయాన్ని ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఆలయంలో 12మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేసి ప్రభుత్వ నిధులు, ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి చేయాల్సిన పనుల గురించి అర్చకుడు హరికృష్ణమాచార్యులును అడిగి తెలుసుకున్నారు. ఆలయ భూములు, రాబడి గురించి ట్రస్ట్ సభ్యులను అడిగారు. ప్రభుత్వ సహకారంతో ఆలయాన్ని సుందరీకరించి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడిచేసిన టీడీపీ నాయకుడిని అరెస్ట్ చేయాలి

సాలూరు: మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడిచేసిన టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడిపై కేసు నమోదుచేసి, తక్షణమే అరెస్ట్‌చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పలువురు విలేకరులు బుధవారం పట్టణంలో జాతీయరహదారిపై నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాజశేఖర్, సీఐ రామకృష్ణలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు బాలి విశ్వేశ్వరరావు, రాపాక కూర్మారావు, నల్లిగోవిందరావు, కె.సింహాద్రి, బంకురు శ్రీనువాసరావు, కూనిశెట్టి రామ్మోహన్‌రావు, రమణమూర్తి, వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీకాంత్, రోహిత్, గుప్తా, ప్రశాంత్, వెంకటేష్, నల్లి శ్రీనువాసరావు, చంద్రమౌళి,ఎం. కృష్ణారావు, చౌక్కాపు తనూజ్, అల్లు శ్యామ్, సంతోష్‌కుమార్, థామస్, జార్జి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాకలపాటి రఘువర్మకు టీడీపీ మద్దతు

● మంత్రి సంధ్యారాణి

సాలూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టీడీపీ కూటమి ప్రభుత్వం పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్లు స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.ఈ మేరకు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అధ్యాపకులతో మాట్లాడారు. రఘువర్మకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.